క్లుప్తంగా

మన ఊరును శుభ్రంగా ఉంచుదాం



ఏ.కోడూరులో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్

మహానంది: మన ఊరును పరిశుభ్రంగా ఉంచుకుందాం, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకుందామని ఏ.కోడూరు సర్పంచ్ మన్నె జ్ఞానాభరణం తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య పనుల్లో భాగంగా ఎంపీయూపీ పాఠశాల, మెయిన్‌రోడ్డు ప్రాంగణాల్లో శుక్రవారం డ్రైడే, ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. వర్షాకాలంలో మరింత జాగ్రత్తలు అవసరమన్నారు. పీఎస్ సుబ్బారావు, ఏఎన్ఎంలు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



ఈదురుగాలులకు పడిపోయిన విద్యుత్ స్తంభాలు

కొత్తపల్లి: మూడురోజుల క్రితం ఈదురుగాలు, వర్ష బీభత్సానికి గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈదురుగాలులకు మండలంలోని గోకవరం గ్రామంలోని గిరిజన గురుకుల పాఠశాల రహదారిలో విద్యుత్ స్తంభాలు కిందపడ్డాయి. శుక్రవారం నాటికి నాలురోజులు గడుస్తున్నా స్తంభాలను పునరుద్ధరించే చర్యలు చేపట్టకపోవడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మోటారు, పైపుల విరాళం



నూతన మోటారుకు పూజలు నిర్వహిస్తున్న దాతలు, పండితులు

మహానంది: దేవస్థానం పొలంలో సాగవుతున్న పశుగ్రాసం కోసం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బొగ్గరపు సుబ్రహ్మణ్యం, సుమిత్ర దంపతులు శుక్రవారం రూ.లక్ష విలువైన విద్యుత్ మోటార్‌తో పాటు పైపులను అందించారు. పొలం వద్ద ఏఈఓ ఓంకారం వేంకటేశ్వరుడు, వేదపండితులు హనుమంత శర్మ, గోశాల అర్చకులు శరభయ్యశర్మ ఆధ్వర్యంలో పూజలు చేసి ప్రారంభించారు. గోవుల ఆకలిని తీర్చేందుకు పెంచుతున్న పశుగ్రాసం కోసం మంచి నీటి మోటారు అందించి భాగస్వాములవడం శుభప్రదమన్నారు. గోవులకు సేవ చేయడం ద్వారా ఎంతో పుణ్యఫలం లభిస్తుందని దేవస్థానం వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.


మహానందీశుడి పల్లకీ సేవ వాయిదా

మహానంది: మండలంలో జోరుగా కురుస్తున్న వర్షంతో శ్రీ మహానందీశ్వరస్వామి పల్లకీ సేవ వాయిదా పడింది. క్షేత్రంతో పాటు పరిసర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు నిరంతరాయంగా వర్షం కురిసింది. దీంతో స్వామి,అమ్మవార్ల పల్లకీ సేవ రద్దు చేసినట్లు ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

మిడుతూరు: మండలంలోని తలముడిపి గ్రామంలో ఓ మహిళ కడుపు నొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ మహేశ్వరి (24) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేది. గురువారం నొప్పి ఎక్కువ కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం కోలుకోలేక మృతి చెందింది. మృతురాలికి భర్త సంజీవ, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

పుస్తక పఠనంతో నైతిక విలువలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రిటైర్డ్ న్యాయమూర్తి శివప్రసాద్

ఆళ్లగడ్డ: పుస్తక పఠనం వల్ల వ్యక్తుల్లో నైతిక విలువలు పెంపొందుతాయని రిటైర్డ్ న్యాయమూర్తి శివప్రసాద్, ఎస్ఐ నగీన అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి అరుణ కుమారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు.. వివిధ అంశాల్లో శిక్షణ పొంది పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



ఆత్మకూరు-కరివేన గ్రామాల వద్ద ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు



వర్షం.. రైతన్నల హర్షం



నందికుంట సమీపంలో పంటపొలాల్లో నిలిచిన వర్షపు నీరు

- ఆత్మకూరు, నందికొట్కూరు నియోజకవర్గాల్లో భారీ వర్షం
- ఆత్మకూరులో 13.4 మి.మీ. వర్షపాతం నమోదు
- పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



యర్రగూడూరు వద్ద పొలంలో నిలిచిన వర్షపు నీరు

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలో శుక్రవారం తెల్లవారుజామున మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. రెవెన్యూ అధికారుల సమాచారం మేరకు 13.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. మండలంలో సుద్దవాగు, బవనాసి నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. రహదారుల వెంట నీరు ప్రవహించింది. ప్రధానంగా ఆత్మకూరు-కరివేన గ్రామాల వద్ద వర్షపునీరు కారణంగా చెరువుల కాలువ పూడిపోవడంతో రహదారులపై వర్షపునీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షాల జోరుతో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో బిజీ అయ్యారు.

పాములపాడు: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షం 49.6 మి.మీ.గా నమోదైంది. ఈ వర్షంతో పొలాలు విత్తనానికి అదునయ్యాయి. పొలాల్లో వర్షపు నీరు నిలిచి భూములు పొడిబారేలా తయారయ్యాయి. ఇక రెండు రోజులు వరుణుడు తెరపినిస్తే రైతన్నలు విత్తనాలు వేయడానికి సిద్ధంగానున్నారు. మండలంలో 13వేల హెక్టార్లలో పంటలు సాగు సాగు భూమి ఉంది. ఇందులో 10వేల హెక్టార్ల ఆయకట్టు, 3వేల హెక్టార్లు నానాయకట్టు ఉంది. ఖరీఫ్‌లో ప్రధానంగా మొక్కజొన్న, సోయాబీన్, వరి, పత్తి పంటలు సాగు చేసేందుకు అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. వర్షాలు పుష్కలంగా కురిస్తే సాగు పెరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే పలు గ్రామాల్లో రైతులు మొక్కజొన్న విత్తనం వేశారు. సోయాబీన్ విత్తనాల కోసం నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్‌సీని సంప్రదిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ సోయాబీన్ రకం జేఎస్పీ 335, కిలో రూ.80చొప్పున 30కేజీల ప్యాకెట్ రూపంలో అందుబాటులో ఉన్నాయి.

కొత్తపల్లి: గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు మండలంలో మోస్తరు వర్షం కురిసింది. వేసవి దుక్కులు దున్నుకొని ఖరీఫ్ సాగుకోసం వేచిచూస్తున్న తరుణంలో ఈ వర్షం పడడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడడంతో పంటపొలాల్లో వర్షపు నీరు చేరింది. మండంలోని కపిలేశ్వరం, ముసలిమడుగు, గుమ్మడాపురం, పలుగ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో 40.6 మి.మీల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఐ పాల్ తెలిపారు. రైతన్నలు సాగుకోసం విత్తనాలను సిద్ధం చేసుకొంటున్నారు.



వర్షపు నీటితో నిండిన తంగడంచ చెరువు



తిమ్మాపురంలో వర్షం కురుస్తున్న దృశ్యం

మహానంది: మండలంలో వర్షం దంచికొట్టింది. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి వరకు ఏకధాటిగా వర్షం జోరుగా కురిసింది. ఇప్పటికే వివిధ రకాల పంటలను సాగు చేసుకునేందుకు సిద్ధం చేసుకున్న పొలాలు ఈ వానతో పదనెక్కుతాయని రైతులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా లోతట్టు కాలనీల్లో ఉన్న ప్రజలు తమ ఇళ్లల్లోకి నీరు చేరుతుందని ఆందోళన చెందుతున్నారు. బండిఆత్మకూరు మండలంలోనూ సాయంత్రం నుంచి రాత్రి వరకు జోరుగా వర్షం కురిసింది. పంట పొలాల్లో నీరు నిలిచింది.

మిడుతూరు: మండలంలో గురువారం అర్ధరాత్రి మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 36.32 మి.మీ వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో మినుము, పత్తి, మొక్కజొన్న పంటల సాగుకు ఈ వర్షాలు ఎంతో ఉపయోగపడతాయని రైతులు చెబుతున్నారు.

జూపాడుబంగ్లా: గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 38.8 మి.మీ.గా నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలోని పాములపాడులో అత్యధికంగా 49.6 మి.మీ. వర్షపాతం నమోదు కాగా నందికొట్కూరులో అత్యల్పంగా 8.6 మి.మీ. వర్షపాతం నమోదైందన్నారు. కొత్తపల్లిలో 40.6ఎం.ఎం, మిడుతూరులో 36.2ఎం.ఎం, పగిడ్యాలలో 10.2 ఎం.ఎం. చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు. జూన్ మాసం ప్రారంభం నుంచి మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో మండలంలోని పారుమంచాల, తంగడంచ, మండ్లెం చెరువులు జలకళను సంతరించుకోవటంతో ఆయకట్టు రైతులు ఖరీఫ్ పంటలసాగుకు సిద్ధమవుతున్నారు.

మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి



సంగమేశ్వరంలో వేపదారు శివలింగానికి జలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

కొత్తపల్లి: మండలాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కృషి చేస్తానని, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడమే మా లక్ష్యం అని నందికొట్కూరు నూతన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో ఉన్న సప్త నదుల సంగమ తీరంలో వెలిసిన సంగమేశ్వరాలయం, కొలనుభారతి క్షేత్రాలను దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని గ్రామాల సమస్యలను తెలుసుకొని పరిష్కారించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఎత్తిపోతల పథకాలను మరమ్మతులు చేయించి ప్రతి పొలానికి సాగునీరు అందించి రైతుల కష్టాలను తీరుస్తామన్నారు. నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, మండల కన్వీనర్ నారపురెడ్డి, మాజీ కన్వీనర్ జడ్డు వెంకటరెడ్డి, క్లస్టర్ కోఆర్డినేటర్ లింగ స్వామి గౌడ్, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ పుల్లయ్య గౌడ్, బుచ్చిరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్ : మండలంలోని అల్లూరు గ్రామంలోని మాండ్ర శివానందరెడ్డి స్వగృహంలో నూతన ఎమ్మెల్యేగా ఎన్నికైన గిత్తా జయసూర్యను ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాండ్రశివానందరెడ్డితో కలిసి ఆయనను సన్మానించి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోండి




సొసైటీలో సభ్యత్వాన్ని రెన్యూవల్ చేయించుకుంటున్న రైతులు

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలో ఉన్న 80బన్నూరు సహకార సొసైటీలో సభ్యులుగా ఉన్న రైతులు వారి సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలని సొసైటీ చైర్మన్ వెంకటరమణ, సీఈఓ చంద్రశేఖర్‌గౌడు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సొసైటీలో 6,150 మంది సభ్యులున్నారని, వారి రేషన్‌కార్డు, ఆధార్, పాన్‌కార్డు పట్టాదారు పాసుపుస్తకం, నామిని ఆధార్‌కార్డు జిరాక్సులతో పాటు మూడు ఫొటోలతో కార్యాలయంలో దరఖాస్తును పూరించి సభ్యత్వాన్ని రెన్యూవల్ చేయించుకోవాలని కోరారు. నెలాఖరులోగా సొసైటీలో సభ్యత్వం ఉన్న రైతులందరూ రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. సభ్యత్వం రెన్యూవల్ చేయించుకొన్న వారికి మాత్రమే ఖరీఫ్ పంట రుణాలు మంజూరయ్యే అవకాశాలున్నాయని చెప్పారు.

ఐక్యపోరాటాలతో సమస్యల పరిష్కారం

ఆత్మకూరు: కార్మికులు, ఉద్యోగులు ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ధనుంజయ సమావేశ భవనంలో సీఐటీయూ జనరల్‌బాడీ సమావేశం పట్టణాధ్యక్షుడు రజాక్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ కార్మికులపైన అదనపు పనిభారం మోపి వ్యాపారులు లాభాలను ఆర్జిస్తూ మరింత కోటీశ్వరులుగా మారుతున్నారని, కార్మికులు పెరుగుతున్న ధరలను భరించలేక ఏమి తినగలిగే పరిస్థితుల్లో లేరన్నారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ సివిల్ కోడ్‌లుగా కుదింపు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను పెట్టుబడుదారులకు, కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పి ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు, నిరుద్యోగులు అంతా ఐక్యంగా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు రణధీర్, నాయకులు జాబివుల్లా, రాముడు, ముర్తుజావలి, భారతి, వరలక్ష్మి, సులోచన పాల్గొన్నారు.

రేనాటిగడ్డ ఖ్యాతి చాటిన బీవీ



బీవీ సుబ్బారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: కోవెలకుంట్లకు చెందిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, శాసనసభ స్పీకర్ దివంగత బీవీ సుబ్బారెడ్డి రేనాటిగడ్డ ఖ్యాతిని దేశ నలుమూలలా చాటారని వక్తలు కొనియాడారు. బీవీ 50వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గ్రామ పంచాయితీ కార్యాలయం పక్కన ఉన్న పార్కులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి, సీపీఎం జిల్లా నాయకుడు సుధాకర్, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు ఓబులేసు బీవీ సేవలను గుర్తు చేశారు. ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్ పదవులకు బీవీ వన్నె తెచ్చారన్నారు. మాజీ సైనిక ఉద్యోగి సహదేవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, రఘు, బీవీ అభిమానులు ఓబన్న, కృష్ణారెడ్డి, మద్దిలేటి, పుల్లయ్య పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తి వేయాలని వినతి



డీఆర్ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌జీఓ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): సార్వత్రిక ఎన్నికల సమయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ నేతలు జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావును కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగల్‌రెడ్డి, కార్యదర్శి జవహర్‌లాల్, నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, కేసీహెచ్ కృష్ణుడు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి తదితరులు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్‌ఓకు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు.

చెంచుగూడెంలో వైద్యశిబిరం

ఆత్మకూరు: మండలంలోని బైర్లూటీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అమలాపురం చెంచుగూడెంలో వైద్యాధికారి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని గర్భిణు సూచించారు. వర్షాకాలం ప్రారంభం అయినందున కాచి చల్లారిన నీటిని తీసుకోవాలని చెప్పారు.ఏదైనా ఆరోగ్య సమస్యలు వస్తే దగ్గరలోని ఆరోగ్య కేంలో సంప్రదించాలన్నారు. సీహెచ్‌ఓ రజిత, హెల్త్ అసిస్టెంట్ మహేశ్వరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మృగశిర కార్తె వేడుకలు

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మృగశిరకార్తె పండగను ఆనందోత్సవాల మధ్య ప్రజలు జరుపుకుంటున్నారు. శనివారం కూడా వేడుకలు చేసుకుంటారు. కార్తె ప్రారంభమైతే ముల్లోకాలు చల్లబడతాయనే నానుడిని నిజం చేస్తూ విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో వేడి దూరం చల్లటి వాతావరణం మొదలైంది. వరుణుడి కరుణతో రైతులు వ్యవసాయ పనుల్లో జోరుగా నిమగ్నమయ్యారు. పొలాల్లో ఎరువులు, గడ్డి చెత్తను తొలగించి విత్తనాలకు సిద్ధం చేస్తున్నారు. పండగను సంప్రదాయ పద్ధతిలో ఆనందోత్సవాల మధ్య ప్రజలు జరుపుకున్నారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తుల సందడి

మహానంది: క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉచిత దర్శనం, ఆర్జిత సేవాటికెట్లు, మహాదాశీర్వచనం, అభిషేకం సేవల ద్వారా భక్తులు స్వామివారి సేవలో పాల్గొని తరించారు. ఉదయం, సాయంత్రం జరిగిన అష్టవిధ మహా మంగళ హారతుల సేవలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు చేపట్టారు.

విజయవంతం చేయండి

నందికొట్కూరు: ఈ నెల 10వ తేదీన సిద్ధేశ్వరం గ్రామంలో జరగనున్న మహాసభలను విజయవంతం చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక నాయకులు జయరాం పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సిద్దేశ్వరంలో తీగల వంతెనకు బదులుగా 520 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో అలుగు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయలసీమ విద్యావంతుల వేదిక కో కన్వీనర్ రత్నం ఏసేపు హాజరవుతారని చెప్పారు. అనంతరం మహాసభలకు సంబంధించిన పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. నాగమురళి, వెంకటరమణ, నాగరాజు, నాగార్జున ఆంజనేయులు తదితరులే పాల్గొన్నారు.

జంబులమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో శుక్రవారం జంబులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుడు నాయిని మద్దిలేటి మాట్లాడుతూ నూతన ఆలయ నిర్మాణం, నూతన విగ్రహ ప్రతిష్ఠ పూర్తయి 41 రోజులు గడవడంతో ప్రత్యేక పూజలు చేశామన్నారు. వారం తం అమ్మవారికి యాగాలు, అర్చనలు చేయించామని, ప్రస్తుతం బలిదానం కార్యక్రమం చేపట్టామన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. పూజల్లో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచు విజయసింహారెడ్డి,జిల్లా నీటి సంఘం మాజా ఉపాధ్యక్షుడు కోట్ల నాగేశ్వరరెడ్డి, మండల కార్యదర్శి మధుసూదన్‌రావు, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు శ్రీనివాసులు, మనోహర్, టీడీపీ నాయకులు జీఎం నవి, సురేష్ పాల్గొన్నారు.

చెరువు నిండింది.. ఆనందం పెంచింది!



చెరువు నిండటంతో గంగమ్మకు వాయనం సమర్పించి మొక్కులు తీర్చుకొంటున్న ఆయకట్టు రైతులు



గంగమ్మకు ప్రత్యేక పూజలు చుస్తున్న రైతులు

జూపాడుబంగ్లా: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పారుమంచాల చెరువు నీటితో నిండటంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం రైతులు చెరువు తూము వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ ఏడాది తమకు బంగారుపంటలు పండేలా ఆశీర్వదించాలని వాయనం సమర్పించి పూజలు చేశారు. చెరువు కింద 1,850 ఎకరాల ఆయకట్టు ఉండగా చెరువులో పూడిక చేరడంతో ప్రస్తుతం వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు తెలిపారు. గతేడాది కంటే ఈఏడాది ముందస్తుగా చెరువు నిండటంతో ఖరీఫ్ పంటలను త్వరగా సాగుచేసుకొనే వెసలుబాటు కలుగిందని చెబుతున్నారు. సర్పంచ్ మాధవరం ప్రకాశం, రైతులు మూలింటి చెంచిరెడ్డి, దివాకర రెడ్డి, జయరామిరెడ్డి, పుల్లంరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రంగస్వామి, కర్ణ, రాముడు, రవిప్రకాశ్, గులకరాజు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీ విత్తనాలివ్వాలి

కొత్తపల్లి: ముందస్తు వర్షాలు కురుస్తున్నాయని, రైతులు పొలాలను ఖరీఫ్ సాగుకు సిద్ధం చేసుకుంటున్నారని, ప్రభుత్వం వెంటనే సబ్సిడీ విత్తనాలు మంజూరు చేసి అన్నదాతలకు అండగా నిలవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రాజశేఖర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.స్వాములు కోరారు. శుక్రవారం మండలంలోని శివపురం, చిన్న గుమ్మడాపురం, ముసలమడుగు గ్రామాల్లో ఏపీ రైతు సంఘం సభ్యత్వ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. వారు మాట్లాడుతూ బహిరంగా మార్కెట్‌లో విత్తనాలు ధరలు మండుతున్నాయని, అధికారులు వెంటనే విత్తనాల పంపిణీకి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సంజీవ, వీరన్న, రాయుడు, దాసు, గోపాల్, జ్ఞాన సూర్యుడు, దేవకుమార్, సత్యరాజు పాల్గొన్నారు.

కాళికాంబదేవికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. ఒడి బియ్యం, పుష్పాభిషేకం కార్యక్రమాలు జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుకాల పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాల్లో ఈఓ లక్ష్మీనారాయణ, దైవస్థానం చైర్మన్ అరవేటి వాసు,విజయ్‌కుమార్, లక్ష్మీదేవి, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రహ్మణ్యం శాస్త్రి, తిమ్మయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.